క్లుప్తంగా

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు


కౌతాళంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో సందడి నెలకొన్నాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుముల దొడ్డి ఆంజనేయ స్వామి, అగసలదిన్నెలోని ఆంజనేయాస్వామి, మండల కేంద్రంలోని ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి ఆయా స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు.

4న శ్రీనివాస కల్యాణం

ఆదోని రూరల్ : జూన్ 4వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు వెంకటేశాయ భక్త మండలి ఆదోని జిల్లా అధ్యక్షులు ఏ.బి.గౌడ్, భీమరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మున్సిపల్ మైదానంలో 4న మధ్యాహ్నం 3 గంటలకు మంగళ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీవారి విగ్రహాల వాహనం ఊరేగింపుగా మున్సిపల్ మైదానం చేరుతుందన్నారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరుగుతుందని చెప్పారు.నగర ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, బి.రాముడు, భీమలింగారెడ్డి పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

ఆదోని టౌన్ : పట్టణంలోని క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను శనివారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర కిట్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ షేకున్‌బాను, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని సెంట్రల్: కర్ణాటక నుంచి నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో మద్యం సరఫరా చేస్తున్న బోయ శంకర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ ఎం.రామస్వామి తెలిపారు. మంత్రాలయం ఓపీలో ఉన్న పరుశురాం రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు జనరల్ బోగీలోనున్న బ్యాగును తనిఖీ చేయగా 180 ఎంఎల్ ఒరిజనల్ చాయిస్, టెట్రాప్యాకెట్స్ 48, 90ఎంఎల్ ఒరిజనల్ టెట్రా ప్యాకెట్లు 187 లభించాయి. నిందుతుడిని ఎమ్మిగనూరు సెబ్ పోలీసులకు అప్పగించామని చెప్పారు.

ఆదోని రూరల్ : మండలంలోని మదిరె క్రాస్ రోడ్డు వద్ద పర్వతాపురం గ్రామానికి చెందిన పి.మస్తాన్‌సాబ్ తన మోటార్ సైకిల్‌పై రెండు కర్ణాటక మద్యం బాక్సులు రవాణా చేస్తూ శనివారం పట్టుబడ్డాని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్ రెడిడ్డి, కానిస్టేబుల్ సోమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జలకళ బోరు ప్రారంభం


జలకళ బోరును ప్రారంభించిన దృశ్యం

కోసిగి: సన్నకారు రైతుల పొలాల్లో వైఎస్సార్ జలకళ పథకం కింద వేసిన ఉచిత బోర్లు రైతుల జీవితాలను మార్చి వేస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాతనూరు గ్రామంలో సర్వే నంబర్ 388–బిలో కురువ అయ్యన్న పొలంలో వైఎస్సార్ జలకళ పథకం కింద వేసి బోరును మోటార్ ఆన్‌చేసి ప్రారంభించారు. నాయకులు శేషప్ప, వడ్డే చంద్రశేఖర్, దేవపుత్ర, రామన్న, చిన్న అయ్యన్న పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కోసిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసినట్లు పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఫస్టియర్ జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 189 మందికి గానూ 31 మంది గైర్హాజరయ్యారని,మధ్యాహ్నం సెకెండియర్ పరీక్షలకు 141 మందికి గానూ 120 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి మాధవరం తండా గ్రామంలో నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల కొందరు సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకొని ఆ తర్వాత బెదిరింపులకు గురిచేస్తున్నారని, అలాంటి వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. పరిచయం లేని వ్యక్తులకు వివరాలను చెప్పడం మంచిది కాదని చెప్పారు.

వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పు

- అభిమానం కూడగట్టుకుంటున్న 'ఫ్యామిలీ డాక్టర్'
- జిల్లాలో 40 వాహనాలతో పల్లెల్లో వైద్య సేవలు
- రోజుకు 3 వేలకుపైగా ఓపీ నమోదు
- 11వ స్థానంలో కర్నూలు జిల్లా

కదలలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని, మానసిక దివ్యాంగులను, దివ్యాంగులను వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు. ఇక మారుమూల పల్లె నుంచి రావాలంటే ప్రత్యేక వాహనంలో వ్యయ ప్రయాసల కోర్చి అవసరమైతే రోజుల తరబడి ఉండాల్సి వస్తుంది. అలాగే.. పల్లెల నుంచి వైద్య సేవల కోసం పట్టణాలకు రావాలంటే గ్రామీణుల అవస్థలు వర్ణనాతీతం. వారందరి ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. నెలకు రెండుసార్లు వైద్యులు, సిబ్బంది గ్రామానికి వచ్చి సాయంత్రం వరకు ఉండి ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందించి, మందులు ఉచితంగా అందజేసి ప్రజల అభిమానం పొందుతున్నారు.



చెన్నెహాళ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్, సూగూరులో మంచం పట్టిన వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి గోవిందమ్మ

మంత్రాలయం: పల్లె ముంగిట గ్రామీణులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందుతున్నాయి. మారుమూల గ్రామాలకు ఫ్యామిలీ డాక్టర్ వెళ్లడంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఇంటింటికి వైద్యం దరి చేరడంతో గ్రామీణుల మోముల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంచం పట్టిన రోగులు, గర్భిణులు, బాలింతలకు ఫ్యామిలీ డాక్టర్ బంధువుగా మారాడు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 104 వాహన సేవల్లో మార్పు తీసుకురావడంతో ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయి. వ్యయప్రయాశలు లేకుండా చేశారని పల్లెవాసులు పేర్కొంటున్నారు.

రోజుకు 3 వేలు మందికి పరీక్షలు

జిల్లాలో మొత్తం 40 వాహనాలతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 104 వాహనాలలో ఓ డాక్టర్, డేటా ఆపరేటర్‌తో పాటు డ్రైవర్ ఉంటారు. కర్నూలు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ప్రతి పల్లెలోనూ ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుతున్నాయి. రోజుకు జిల్లాలో దాదాపు 3 వేల మందికి పరీక్షలు చేయడంతోపాటు మందులు అందజేస్తున్నారు. నెలకు లక్ష మందికి సేవలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రెండు మూడు నెలలు గడిస్తే నెలకు 2 లక్షల మందికి ఓపీ చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. గ్రామాల్లోని వైఎస్సార్ క్లినిక్ కేంద్రాలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటాయి. ప్రతి గ్రామంలో నెలలో రెండు రోజులు ఈ సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు గానూ మెరుగైన సేవల్లో కర్నూలు జిల్లా 11 స్థానంలో నిలిచింది. వైద్య సేవలను మెరుగుపరిచేందుకు వైద్య బృందం కృషి చేస్తోంది.

అందించే వైద్య సేవలు..

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో దాదాపు అన్ని రోగాలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత, టీబీ, బీపీ, మధుమేహం, చిన్నారులు, శరీర నొప్పులు, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులన్నింటికీ వైద్య సేవలు అందజేస్తున్నారు. అత్యధికంగా మధుమేహం, రక్తహీనత, బీపీతో బాధపడుతున్న కేసులు వస్తున్నాయని వైద్యాధికారిణి గోవిందమ్మ పేర్కొన్నారు.

నిర్వహణ ఇలా..

జిల్లాలో 40 వాహనాల సేవలపై ప్రత్యేక కమిటీ పనిచేస్తోంది. నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓపీ వివరాలు నమోదు చేయబడతాయి. డేటా ఆపరేటర్ ఎంట్రీ చేసే ప్రతి వివరం రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా ఈ కార్యక్రమం నడుస్తోంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ వైద్యుడు అందుబాటులో ఉంటారు. మంత్రాలయం నియోజకవర్గంలో 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 112 గ్రామాల్లో ఈ బృహత్తర సేవలు అందుతున్నాయి.

నాయప్ప సల్లంగా ఉండాలి



నాయప్ప జగన్ సల్లంగా ఉండాల. ముసలోళ్లకు ఇంటి కొడుకుగా పింఛన్ ఇస్తున్నాడు. ఇప్పుడేమో అవ్వతాతల కోసం ఇంటి వద్దకే డాక్టర్‌ను పంపుతున్నాడు. మాలాంటోళ్లకు ఇంతకన్నా ఇంకేమి కావాలి. నాయప్ప బాగుంటే ముసలోళ్లకు ఎంతోమందికి మేలు జరుగుతుంది. వయసులో సిన్నోడైనా మంచిగా పాలిస్తుండు. మంచం పట్టినోళ్లకు ఈ కార్యక్రమం బాగుంటుంది.

– మద్దమ్మ, పల్లెపాడు, కోసిగి

రాజీ లేకుండా సేవలు



ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టి పేదలకు ఎంతో మేలు చేసింది. బృహత్తర కార్యక్రమంలో రాజీ లేకుండా వైద్యులు శ్రమిస్తున్నారు. మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ విధులకు హాజరవుతున్నారు. సేవలను విస్తృతం చేసి జిల్లాకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. జిల్లా ర్యాంకు మరింతగా మెరుగుపడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– బాల మురళీకృష్ణ, నోడల్ ఆఫీసర్, కర్నూలు

జగనన్న కాలనీ పరిశీలన

ఆదోని రూరల్ : మండలంలోని దొడ్డనగేరి గ్రామంలోని జగనన్న కాలనీని ఎంపీడీఓ గీతావాణి శనివారం పరిశీలించారు. కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై సచివాలయ అధికారులు, ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇళ్లు నిర్మాణాలు చేపట్టని 38 మంది లబ్ధిదారులతో చర్చించి త్వరగా ఇళ్ల నిర్మా ణాలు ప్రారంభించాలని సూచించారు.సకాలంలో లబ్ధిదారులకు బిల్లులు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హౌసింగ్ డీఈ రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్‌బాషా, ఈఓపీఆర్డీనాగరాజు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

పెద్దకడబూరు: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామోహ్మన్ రెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిర్ణీత వయస్సు దాటిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ శివలింగమ్మ, క్యాతాయిని, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ పోటీలు

ఆదోని అర్బన్ : ఫిలిప్స్ వర్ధంతి సందర్భంగా ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అరుంజ్యోతినగర్ అరులయ్యగుడి వెనుక అండర్–19 కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు ఉంటాయని, విజేతలకు వరుసగా రూ.2వేలు, రూ.వెయ్యి అందజేస్తామని పేర్కొన్నారు.

రేపు భూమి పూజ

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో నూతన గ్రానైట్ బండపరుపునకు ఈనెల 29వ తేదీన భూమి పూజ చేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ భూమి పూజకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే ఈనెల 30,31 తేదీల్లో స్వామి వారి హుండీ సొమ్ము లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న తపన


మా కుటుంబానికి అన్ని పథకాలు అందుతున్నాయని చెబుతున్న వృద్ధురాలు


ఈరన్నగౌడ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వై. ప్రదీప్ కుమార్ రెడ్డి

కౌతాళం : పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపన అభినందనీయమని వై. ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు శనివారం నదిచాగి గ్రామంలో పర్యటించారు. సంక్షేమ పథకాలు గ్రామ వలంటీర్ల ద్వారా సరిగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, వారు ఆర్థికంగా మెరుగైన స్థానంలో ఉండాలని పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. గ్రామంలోని కొన్నివీధుల్లో విద్యుత్ స్తంభాలు, తాగునీరు, సీసీ రోడ్లు నిర్మించాలని స్థానిక కోరగా త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. హాల్వి రోడ్డులో పేదలకు 1.5సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని కొనుగోలు చేసిన పొలంలో కబ్జాదారులు ఒకటి కన్నా ఎక్కువ ప్లాట్లను వారి ఆధీనంలో ఉంచుకున్నట్లు కాలనీవాసులు ప్రదీప్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన రీ సర్వే చేసి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారులకు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా 1.5సెంట్లకు అనుగుణంగా స్థలాలు కేటాయించి మిగులు స్థలాన్ని స్థలం లేని పేదలకు పంచాలని రెవెన్యూ అధికారుల్ని కోరారు. అంగన్‌వాడీ–2 కేంద్రంలో చిన్నారులతో గడిపి, వంటలను పరిశీలించారు.సర్పంచ్ మహేష్, ఉప సర్పంచ్ నగేష్, రామన్నగౌడ్, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, నాయకులు గురునాథ్‌రెడ్డి, అనిల్‌కుమార్, హాల్వి చెన్నప్పధని, లింగాలదిన్నె లక్ష్మి, ఎంపీటీసీ లింగన్నగౌడ్, మాజీ ఎంపీటీసీ ఈశప్పగౌడ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మంత్రాలయం :మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈరన్న గౌడ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో భీమా నిలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఈరన్న గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరినట్లు చెప్పారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకోబ, నాయకులు రోగప్ప, రవిరెడ్డి, లక్ష్మయ్య, బాబు, హనుమంతు, నరసన్నగౌడ, రామాంజిని, యోహన్, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించండి


వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్‌మధుసూదన్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచి ఒక్కటైనా ఉందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలతో ప్రజల మనస్సులో నిలిచిపోయారని, అయితే ఆయన కంటే మిన్నగా జగనన్న పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రతిపక్షాల మోసపూరిత మాటలను ప్రజలు గ్రహించాలని, పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. వలంటీర్లు,కౌన్సిలర్లు, సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణంలో 643 మంది వలంటీర్లు ఉండగా వారిలో 574 మందికి పురస్కారాలు లభించాయని చెప్పారు. పురపాలక చైర్‌పర్సన్ బి.శాంతి, వైస్ చైర్మెన్ నరసింహులు, కౌన్సిలర్లు, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువును స్వాధీనం చేసుకోవాలి

ఆదోని రూరల్ : పాండవగల్ గ్రామపెద్ద చెరువును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ చేపట్టిన దీక్ష శనివారం కొనసాగింది. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పార్టీ మండల కార్యదర్శి కె.లింగన్న దీక్షను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కోర్టు నుంచి స్టే లేకపోయినా అక్రమంగా పట్టాలు పొంది, పంటలు సాగుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నాయకులు పాండురంగ, గోవిందు, రెడ్డి, భీమాంజనేయులు, రమేష్, కొండయ్య పాల్గొ న్నారు. కాగా దీక్షలకు సీపీఎం పట్టణ సీనియర్ నాయకుడు భీమానందరెడ్డి, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు మద్దతు తెలిపారు.

స్వదేశానికి బయలుదేరిన ఆదోని యువకుడు


ఇమ్రాన్‌ను ఇండియాకు పంపుతున్న గౌస్

ఆదోని అర్బన్ : పట్టణంలోని నాల్బంద్ మోహల్లా ప్రాంతానికి చెందిన గౌస్‌బాషా సహకారంతో తాను సురక్షితంగా దుబాయ్ ఎయిర్‌పోర్టు నుంచి స్వదేశానికి బయలుదేరుతున్నానని ఆదోని యువకుడు ఇమ్రాన్ శనివారం సోషల్ మీడియా ద్వారా తెలిపాడు. దుబాయ్‌లో పని ఉందని ఏజెంట్ ద్వారా వెళ్లి రెండు నెలలుగా అక్కడ చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే అక్కడికి వెళ్లిన ఇమ్రాన్ వీసా గడువు ముగిసింది. దుబాయ్‌లో ఉన్న ఆదోనికి చెందిన గౌస్ వెంటనే అతని వీసాను రద్దు చేయించి పంపించేశారు.

5 నుంచి విద్యాకానుక పంపిణీ

కోసిగి: జూన్ 5వ తేదీ నుంచి ప్రతి పాఠశాలకు విద్యాకానుకలను చేరవేస్తామని ఎంఈఓ మొయినుద్దీన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విద్యాకానులను ఉపాధ్యాయులు, సీఆర్‌పీలతో కలిసి పాఠశాలల వారీగా సంసిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 1– 10వ తరగతి వరకు 14,565 మంది విద్యార్థులకు 1.27లక్షల పాఠ్య పుస్తకాలు కేటాయించగా ఇప్పటి వరకు 80,605 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, బ్యాగులు 15,485, షూస్ బాలురలకు 7,895, బాలికలకు 7,573, సాక్సులు 30,936 వచ్చాయని వివరించారు. వచ్చే నెల 5 నుంచి మొబైల్ వ్యాన్‌ల ద్వారా పాఠశాలలకు చేర్చి పాఠశాల ప్రారంభం జూన్ 12న పిల్లలకు అందజేస్తామని పేర్కొన్నారు.

ఎన్‌సీడీసీడీ సర్వే పకడ్బందీగా చేయాలి


కోసిగిలో సర్వే చేస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలో ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వే పకడ్బందీగా, వేగంగా చేయాలని కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఏఎన్ఎంలతో గ్రామాల్లో సర్వే చేయించారు. గ్రామాల్లో 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించి పరీక్షలు చేయించాలని చెప్పారు. అలాగే అంటు వ్యాధులు మలేరియా, కడ్లకలక, డెంగీ వ్యాధుల నివారణపై జాగ్రత్తలను వివరించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధుల ఉన్న వారికి ఆయూష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ కింద అబా ఐడీని మొబైల్ ఆన్‌లైన్‌లో జనరేట్ చేయాలని కోరారు. వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షల వరకు ఆరోగ్య శ్రీకార్డు ద్వారా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించిందన్నారు. మండలంలో 72 శాతం సర్వే పూర్తయ్యిందని వివరించారు.

పూడికతీత పనులు ప్రారంభం

మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామంలో సాగు నీటి కాలువలోపూడిక తీత పనులను శనివారం సాయంత్రం అధికారులు, నాయకు లు ప్రారంభించారు. డీఈ లక్ష్మణ్‌కుమార్, ఏఈ రా మాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వగరూరు చెరువు నుంచి బూదూరు గ్రామం వరకు ఉన్న సాగునీటి కాలువ ముళ్లపొదలు, పూడికతో నిండిపోయిందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు చెప్పారు. సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిన్నన్న పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పిద్దాం


కోసిగిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోసిగి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వంద శాతం అక్షరాస్యత సాధిద్దామని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాల నుంచి పురవీధుల్లో బాలికల ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, ఎంఈఓ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి మండలంలో బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఎక్కువగా డ్రాప్ అవుట్ అవుతున్నారని, వారిని గుర్తించి తిరిగి చదువుకునేలా ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వం వినూత్న పద్ధతులను అనుసరిస్తోందన్నారు. ర్యాలీలో జీసీడీఓ సునీత, ఏపీఎం జత్యమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ పుష్పలత, హెచ్ఎంలు రాజమౌళి, రాముడు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

ఆదోని సెంట్రల్: తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవిశెట్టి ప్రకాశ్,జిల్లా మైనార్టీ చైర్మెన్ ఎండీ. నూర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. నాయకులు తాయన్న, జయరాం, కలందర్,లక్ష్మన్న,గురుస్వామి, మాణిక్‌రాజు పాల్గొన్నారు.